REGD. NO. A. 40 విడి ప్రతి 12 నయాపైసలు 7-3-58 శుక్రవారం

# జమీన్ రైతు

సంపుటి 30 : మేనేజింగు ఎడిటరు : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి : సంచిక 10

## భూసంస్కరణలవల్ల సాంఘిక కల్లోలంవస్తుంది

### ★★★ నెల్లూరు వ్యవసాయ పశు ప్రదర్శనాన్ని ప్రారంభిస్తూ మంత్రి శ్రీ తిమ్మారెడ్డిగారి ఉద్ఘాటన ★★★

ఈ నెల 5 వ తేది సాయంత్రం నెల్లూరు తాలూకాఫీసు ఆవరణంలో, వ్యవసాయ పారిశ్రామిక ప్రదర్శనమునకు, వ్యవసాయ శాఖామంత్రి శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు; పశుప్రదర్శనమునకు కార్మిక, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు శ్రీ దామోదరం సంజీవయ్యగారు ప్రారంభోత్సవాలు గావించారు. మంత్రులకు జిల్లా అగ్రికల్చరల్ ఆఫీసరు శ్రీ కె. రఘునాధరెడ్డిగారు స్వాగతం చెప్పారు. మంత్రులిరువురు వ్యవసాయ పారిశ్రామిక పశుప్రదర్శనంలోని అన్ని ప్రదర్శన శాలలను గంటసేపుపైగా కలయతిరిగి, తమ సంతృప్తిని ప్రకటించారు. రంగనాధస్వామి బ్రహ్మోత్సవముల సందర్భంలో యీ ప్రదర్శనం ఏర్పాటైనందున, యీ ప్రారంభోత్సవాలలో వేలాదిప్రజలు పాల్గొన్నారు.


పిమ్మట ప్రదర్శనశాల ఆవరణంలో రమ్యంగా అలంకరించబడిన సభామందిరంలో ప్రారంభోత్సవసభ జరిగింది. సభకు శ్రీ దామోదరం సంజీవయ్యగారు అధ్యక్షత వహించారు.

నగరపాలకులు శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారు సభ్యులకు మంత్రులు శ్రీ తిమ్మారెడ్డి, సంజీవయ్యగారలను పరిచయంచేస్తూ, రైతుకార్మిక బాంధవులిరువురూ యీ ప్రదర్శనములను ప్రారంభించడం నెల్లూరు మండలీయుల భాగ్యమన్నారు. శ్రీ వేనకూరు గోపాలకృష్ణారెడ్డిగారు స్వాగతపత్రం సమర్పించారు.

### శ్రీ తిమ్మారెడ్డి

శ్రీ పి. తిమ్మారెడ్డిగారు, యీ ప్రదర్శనోత్సవమును, రైతాంగవాంఛాసిద్ధి ప్రతీకంగా పోల్చారు. స్వరాజ్యంరాగానే రైతులకు సుఖం కల్పిస్తామని మన నాయకులు చెప్పారనీ; కాగా దేశంలో అనిశ్చితస్థితి, భయము, ఆందోళన ఎక్కువైనవనీ, వీటితో గ్రామాల్లో జీవించడం కష్టంగావుందనీ; రైతులు కూలీల మధ్య వైషమ్యం పెంచాలని కొందరు పరాన్నభుక్కులు (కమ్యూనిస్టులని అర్థం) ప్రయత్నిస్తున్నారనీ శ్రీ తిమ్మారెడ్డిగారు చెప్పారు. దేవుని పేరుతో మంచిపనులూ చెడ్డపనులు జరుగుతున్నవనీ, ప్రాజెక్టులు, రైతులకు ఎరువుల సరఫరావంటివి మంచిపనులనీ, భూసంస్కరణల వంటివి చెడ్డపనులుగా భావించవచ్చుననీ, భూసంస్కరణలపేరుతో రైతు క్షేమాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నం వుందనీ అన్నారు. ఆర్థికసిద్ధాంతం పేరుతో భూసంస్కరణలు జరుగుతున్నా, యిందులో రాజకీయాలిమిడి వున్నవనీ, యిందువల్ల సాంఘిక కల్లోలం వస్తుందేమోనని అనిపిస్తున్నదన్నారు శ్రీ తిమ్మారెడ్డిగారు. అధికోత్పత్తి దృష్ట్యా భూసంస్కరణ లవసరమా లేదా అనేది నాయకులు, ప్రభుత్వం ఆలోచించాలన్నారు. సంఘంలో యితరవర్గాల వృత్తుల వారికి సంఘాలున్నట్లే, రైతులకుకూడ సంఘాలత్యంతఅవసరమై యున్నవనీ, రైతాంగాన్ని

—రెండవ పేజీలో




ఆ వూరి ఆస్పత్రిలో నేను డాక్టర్ని. వెంకన్న కొడుక్కి జబ్బుచేసిన ఆ రోజు నే నెప్పటికీ మర్చిపోలేను. కుర్రాడి పరిస్థితి చూస్తే చాలా తీవ్రంగావుంది. నాదగ్గర కావలసిన సాధనా లేమీ లేవు. ఏం చేయగలను? కాని ఎలాగో దేవుడిదయవల్ల జబ్బు నయమయ్యి కుర్రాడికి నెమ్మదించింది. దగ్గరలో డాక్టరు వుంటేగల సౌకర్యమేమిటో అవాళ వెంకన్నకి తెలిసొచ్చింది. నేనుచేసిన కొద్ది వైద్యసహాయానికే అతను ఎంతో కృతజ్ఞత తెలియజేశాడు. ఆమాత్రం వైద్యసహాయమూ కూడా దొరకని పాటివారు ఎల్లా అవస్థలు పడుతున్నారో, మనం డబ్బు పొదుపు చేసుకొన్నందువల్ల వారుకూడా ఎల్లా సుఖపడగలరో అతనికి చెప్పాను. అంతే—రూపాయలు నింపిన ఓ కుండని ఆ సాయంత్రం అతను నా దగ్గరికి తెచ్చాడు. ఎంతో ఆశ్చర్యమయింది. ఆ విలువకు జాతీయ ప్రణాళిక పొదుపు సర్టిఫికెట్లు తనకు కొనిపెట్టమన్నాడు. నాకు పట్టరాని సంతోషం కలిగింది. ఆవేళ నా విధి నేను నెరవేర్చినట్లు భావించాను.

మీ పొదుపు ధనం జాతీయ ప్రణాళిక పొదుపు సర్టిఫికెట్లలో గాని, ఇతర పొదుపు ఉద్యమ సెక్యూరిటీలలో గాని పెట్టుబడి పెడితే ప్రభుత్వం హామీ ఉంటుంది. పన్నులు లేకుండా వడ్డీ కిట్టుతుంది. అంతేకాకుండా ఆస్పత్రులు, స్కూళ్లు, రోడ్లు, కాలవలు, విద్యుచ్ఛక్తి మొదలైన సౌకర్యాలు విస్తరింపజేసే అంశాలుగల జాతీయాభివృద్ధి కార్యక్రమాల అమలుకు అవసరమయ్యే సహాయం చేస్తున్న సంతృప్తి కూడా మీకు లభిస్తుంది.

12-ఏళ్ల జాతీయ ప్రణాళిక పొదుపు సర్టిఫికెట్లు

- పన్నులు లేకుండా సాలీనా 5.41% వడ్డీ
- రూ 5 మొదలు రు 5,000 వరకు వివిధ విలువల్లో ప్రతి పోస్టాఫీసులోనూ లభ్యమవుతాయి.
- ప్రభుత్వం హామీ ఇచ్చినవి

చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం తాలూకు ఇతర ప్రభుత్వ సెక్యూరిటీలు:

10-ఏళ్ల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు డిపాజిట్లు



DA 57/308 TG

జాతీయ పొదుపు ఉద్యమ సంస్థ

ఇతర వివరాలకు: నాగపూరులోని నేషనల్ సేవింగ్సు కమీషనరుకు గాని, మీ రాష్ట్రానికి సంబంధించిన రీజనల్ సేవింగ్సు ఆఫీసరుకు గాని వ్రాయండి.

# బహుమతులపై పన్ను

## *** బిల్లులోని ముఖ్యాంశాలు ***

శ్రీ ఏ. వి. దశరధరామరెడ్డి
బి. కాం., ఏ. సి. ఏ.

ప్రధాని శ్రీ జవహర్లాల్ నెహ్రూ ప్రతిపాదించిన కేంద్రబడ్జెటులో బహుమతులపై సుంకం విధించే క్రొత్తపన్ను ఒకటి ప్రకటించబడింది. ఈ పన్ను ప్రస్తుత పన్నుల విధానములో యేలాటి లోపాలు లేకుండా సమగ్రమైన విధానంగా వుండుటకు, పన్ను ఎగవేతలకు వీలులేకుండా చేస్తూ, పన్నుల విధింపులో సమగ్రత సాధించడం యీ క్రొత్త పన్ను యొక్క వుద్దేశ్యంగా తెల్పబడింది. ఈ చట్టం 1958 ఏప్రెల్ 1 తేదినుండి అమలుకు వచ్చునట్లు తెల్పబడింది. కాని యీ పన్ను యీ ఆర్థిక సంవత్సరపు గత సంవత్సరానికి వర్తిస్తుంది కాబట్టి, యీ పన్ను 1957 ఏప్రెల్ 1 నుండి జరిగే దానధర్మాలకు అన్వయిస్తుంది.

బహుమతుల పన్నుబిల్లులోని ముఖ్యాంశాలను దిగువ యిస్తున్నాము.

### పన్ను ఎవరిమీద?

ఈ బిల్లు ప్రకారం అందరువ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబములు, కంపెనీలు, వ్యాపారసంస్థలు (Firms), వ్యక్తులతో కూడిన సంస్థలు (Association of Persons) బహుమతుల పన్నును చెల్లించవలసి యుండును. 1957 వ సంవత్సరము ఏప్రెల్ 1 వ తేది తర్వాత యివ్వబడు బహుమతులకు ఆ సంవత్సరమునకు సంబంధించిన ఆర్థిక సంవత్సరములో ఆ దానధర్మములపైన బహుమతుల పన్ను విధించబడును. అట్లు విధించుటలో, తనకు తన భర్త చేయు దానములో నుండి భార్యచే చేయబడు దానధర్మములు తన భర్త చేసిన దానధర్మములుగనే పరిగణించబడును.

### వసూలు ఎవరినుండి?

బహుమతిపన్ను బహుమతిచ్చు ఆసామియే చెల్లించవలెను. ఒకవేళ అతనివద్దనుండి ఆ పన్ను వసూలు కాని పరిస్థితులలో, బహుమతి తీసుకున్న ఆసామీవద్దనుండి, బహుమతి పరిమితికి మించకుండా, బహుమతి ఆస్థిమీద మొదటి బాకీగా బహుమతిపన్ను వసూలు చేయబడును.

ఒకవ్యక్తి చనిపోయినప్పటికిన్నీ; లేక ఒక హిందూ అవిభక్త కుటుంబము విచ్ఛిన్నమైనప్పటికిన్నీ; లేదా యేయితర విచ్ఛిన్నమైనట్టి యే వ్యాపార సంస్థల, వ్యక్తులతో కూడిన సంస్థలుగాని, వాటి వాటిచే గత సంవత్సరం చేయబడిన దానధర్మముల ఆస్తులమీద బహుమతి పన్ను వారి వారసులవద్దనుండి, లేదా హిందూ అవిభక్తకుటుంబపు భాగస్తులనుండి లేదా వ్యాపార లేదా వ్యక్తులతోకూడిన సంస్థల వ్యక్తులనుండి అట్టి పరిస్థితులలో ఆదాయపు పన్ను ఏ పద్ధతులమీద మదింపుచేసి వసూలు చేయబడుతుందో, బహుమతిపన్నుకూడా అవిధంగానే మదింపుచేసి వసూలు చేయబడుతుంది.

ఏ ఒక్క గత సంవత్సరములోనైనా బహుమతుల మొత్తము 10 వేల రూపాయలకు మించనిచో, లేదా ఒక వ్యక్తికి 3 వేలకుపైగా బహుమతి యివ్వనట్లయిన, యే గత సంవత్సరములో (Previous Year) గాని బహుమతులమొత్తము 5 వేలకు మించకుండినచో, ఆ బహుమతులమీద ఆ ఆర్థిక సంవత్సరములో (Assessment Year) బహుమతుల పన్ను లేదు. ఆ పైబడు మొత్తములకే పన్ను విధించబడును.

బహుమతులపన్ను ఆదాయపుపన్నువలెనే గత ఏడాది చేసిన దానధర్మములమీద విధించబడును. కాని బహుమతులపన్ను రేటు నిర్ణయించుటకు గత బహు సంవత్సరములలో (1-4-57 ముందు సంవత్సరములు గాక) మొత్తం బహుమతులు, దానధర్మములు చేర్చి వాటిని ఆ ఆర్థిక సంవత్సరములో బహుమతులుగా పరిగణించి, విధించబడు బహుమతిరేటు ప్రకారం, జరుగు ఆర్థికసంవత్సరములో, గత యేడాదిలో యిచ్చిన దానధర్మములపై బహుమతులపన్ను విధించబడును.

### పన్ను రేట్ల వివరం

| పన్ను పరిమితి | పన్ను రేటు నూటికి |
| --- | --- |
| 1) మొదటి 50 వేలు | 4 |
| 2) తర్వాత 50 ,, | 6 |
| 3) ,, 50 ,, | 8 |
| 4) ,, 50 ,, | 10 |
| 5) ,, 1 లక్ష | 12 |
| 6) ,, 2 లక్షలు | 15 |
| 7) ,, 5 ,, | 20 |
| 8) ,, 10 ,, | 25 |
| 9) ,, 10 ,, | 30 |
| 10) ,, 20 ,, | 35 |
| 11) ఆపైమొత్తాలకు | 40 |

### రిబేటు

ఏబహుమతి దారుగాని తను 10 వేలకు పైగా బహుమతి యొసంగిన 15 రోజుల లోగా, 50 వేలకు మించకుండాయిచ్చిన ఎడల నూటికి 4 రూపాయలు; 2 లక్షలకు లోపుగా యిచ్చిన నూటికి 8 లు; మరియు అంతకు పైగాయిచ్చిన నూటికి 15 వంతున లెక్క చేసి బహుమతి పన్ను క్రింద కట్టినచో, అసెస్మెంటు కాలములో ఆ కట్టిన మొత్తమునకు, కట్టిన మొత్తములో నూటికి 10 పాళ్లు వారికి క్రెడిట్ యివ్వబడును. పన్ను త్వరితముగ వసూలగుటకు యీ రిబేటు ఆకర్షణీయంగా చేయబడింది.

బహుమతుల రిటర్ను బహుమతుల చట్టము ఒక ఆర్థిక సంవత్సరమునకు (Assessment Year) అన్వయించునపుడు ఆ ఆర్థిక సంవత్సరపు జూన్ 30 తేదీలోగా ఆ ప్రాంతపు బహుమతులపన్ను అధికారికి బహుమతుల పన్ను రిటను (Gift Tax Return) తెలుపుకొనవలెను.

ఆదాయపుపన్ను అధికారులే బహుమతుల పన్ను అధికారులుగా వారివారి అధికార పరిధిలలో వ్యవహరింతురు. బహుమతులపన్ను ఆదాయపుపన్ను చట్టమునకు సంబంధించిన అసెస్మెంటు, పెనాల్టీ విచారణ, అప్పీలు మొదలగు పద్ధతుల ప్రకారమే బహుమతులపన్ను బిల్లుకూడా నిర్మించబడి యున్నది.

### రొక్కరూపంలోలేని బహుమతులు

బహుమతుల విలువ నిర్ణయించుటలో రొక్కరూపముగాలేని ప్రతి బహుమతి విలువ దానధర్మము చేసిన దినమున ఆ బహుమతి యొక్క మార్కెటు రేటు విలువయే దాని విలువగా పరిగణించబడును. బహుమతులుగా

—కొరవ 4వ పేజీలో

నెల్లూరుకు పులోక కళాశోభితమైన

చిత్రప్రదర్శనశాల

# రంగమహల్

గంభీరము, మనోరంజకమైన ఆకారముతో; కళాభరితమైన అలంకరణలతో; కన్నులపండువైన కాంతితో; సుస్పష్టమైన ధ్వనితో; సుఖదాయకమైన ఆసనములతో - ప్రదర్శనరంగమున పేరుగాంచిన శేషుమహలువారి అధ్వర్యమున నడుపబడుచున్న యీ సినిమా హాలు

ఆంధ్రప్రదేశ్ స్థానిక శాఖామాత్యులు

గౌరవనీయ కాసు బ్రహ్మానందరెడ్డిగారిచే

వాహినీవారి "భక్తపోతన" సందర్శనంతో,

**6-3-58 తేది సా. ప్రారంభింపబడినది**

ప్రేక్షక మహాశయులు శేషుమహల్‌వలెనే యీ నూతన ప్రదర్శనశాలనుగూడా ఆదరింపగోరుతాను.

వాహిని - విజయ సంస్థల శుభాకాంక్షలతో

★

ఆనం రంగారెడ్డి
కార్యనిర్వాహక యజమాని.

Edited, Printed and Published by N. Sree Ramamurthy at the Zamin Ryot Power Press, 170, Thipparajuvari St. Nellore.